'పరోపకారిణి'

శ్రీమతి బి. లక్ష్మీవెంకాయమ్మగారు

"పతియె దైవంబు పతియె సర్వస్వమనుచు విభుని సాధించపరదుచే విధియటంచు
తలచికొలువుడీ సాధ్వీమతల్లులార మహితగుణలార లక్ష్మీసమానలార!"

సంక్రాంతిపండుగ. మధురా నగరమంతయు పచ్చనితోరణములతో వివిధాలంకారములతో స్వర్గధామమువలె ప్రకాశించుచుండెను. అట్టి సంతోషసమయమందొక యుద్యానవనములో సరోవరముదగ్గరనున్న స్ఫటికశిలావేదికపై సుజాతారమాకాంతులు విషణ్ణవదనులై అశ్రుకణములు రాల్చుచు కూర్చుండిరి. వనమంతయు వివిధలతానికుంజములతోను నానావిధసువాసనాపుష్పములతోను శోభించుచుండెను. సరోవరము పద్మసమ్మిళితమై ఆనందము గొల్పుచుండెను. సుజాతాదేవి రామప్రసాద్ అను గొప్ప శ్రీమంతుని బిడ్డ. నిఖిలసద్గుణాలవాల. ఆమె షోడశవర్షప్రాయమును గలిగి, సువర్ణస్వర్ణపద్మసన్నిభములైన నేత్రములు దీర్ఘకుంతలములు దొండపండువంటి అధరము మృణాలవల్లరులంబోలిన బాహువులు సుధాకరునివలె ప్రకాశించుచున్న వదనమునుగలిగి, రతీదేవి మాడ్కి రాజిల్లుచుండెను. రమాకాంతుడు ఇరువదేండ్ల యువకుడు. దబ్బపండువంటి శరీరచ్ఛాయ, ఆకర్ణాంతములైన నయనములు, విశాలవక్షస్థలముగలిగి మదనునిమాడ్కి రాజిల్లుచుండెను. రమాకాంతుని బాల్యమందే అతని జనకుడు మరణించెను. తల్లి అసమర్థురాలగుటచే ఆస్తినంతటిని దాయాదులు వశపర్చుకొనిరి. సుజాతా రమాకాంతులు బాల్యమునుండియు అన్యోన్యమైత్రితో కలిసిమెలిసి మెలగుచుండిరి. ఒకరినొకరు గాఢముగా ప్రేమించిరి. ఆమె జననీజనకులు రాధాకృష్ణప్రసాద్ అను గొప్పజమీందారునకిచ్చి పరిణయముగావింప నిశ్చయించిరి. అప్పటినుండియు ఆమె బహుళపక్ష సుధాకరుని మాడ్కి క్షీణించుచుండెను. వారిరువురును వియోగబాధ సహించలేక యుద్యానవనములో అశ్రుకణములు రాల్చుచుండిరి. సుజాతాదేవి రమాకాంతునితో, "ప్రాణేశ్వరా నేను బాల్యమునుండియు మిమ్ములనే త్రికరణశుద్ధిగా పంచభూతముల సాక్షిగా ప్రేమించుచుంటిని. మీ కర్పించిన హృదయమును మరియొకరి కర్పింపజాలను. ఎన్ని కష్టములనైనను సహించి మిమ్ములనే పరిణయమాడెదను. లేనియెడల ఆత్మహత్యయే శరణ్యము"అని ప్రతిజ్ఞచేసెను. రమాకాంతుడు సుజాతతో, "ప్రేయసీ! నీయొక్క రూపంబును సద్గుణంబులును నా హృదయపీఠమునందు స్థిరముగా నెలకొల్పబడియున్నవి. నిన్నుతప్ప మరియొకరిని వివాహమాడను. సంధర్భపడనియెడల సన్యాసినై దేశాటనము చేయుదునుకాని నా హృదయమును మరియొకరి కర్పించను" అని ప్రతిజ్ఞ చేసెను. వియోగమును భరింపజాలక కొంతసేపు దుఃఖించి ఎవరి భవనములకు వారు వెళ్లిరి. మరుచటిరోజున సుజాతా

దేవి కల్యాణమహోత్సవము. భవనమంతయు బంధుమిత్రులతో నిండియుండెను. సుజాత జనకుని సన్నిధికేగి సాష్టాంగనమస్కారమాచరించి, "జనకా! నేను మనోవాక్కాయకర్మలచేత రమాకాంతునే పతిగా వరించితిని. అతనితప్ప అన్యుల వివాహమాడుట పతివ్రతాలక్షణముగా"దని వినయముతో చెప్పెను. జనకు డామె మాటలను మన్నించలేదు. దుఃఖముతో అంతఃపురమునకు వెళ్లెను. సుజాతకు లలితమోహను డను ప్రియసహోదరుడు కలడు. అత డీమెను బహుప్రేమతో ఆదరించుచుండెను. తండ్రి సహోదరి కోర్కెను నిరాకరించిన సంగతి విని తక్షణమే అంతఃపురమునకు వెళ్లెను. సుజాతాదేవి తనయొక్క దురదృష్టమునకు విచారించి పునర్జన్మమందైనను రమాకాంతుడే భర్తగ కావలయునని సర్వేశ్వరుని ప్రార్థించి విషము త్రాగబోవుచుండెను. చెల్లెలియొక్క సాహసమునకు దిగ్భ్రాంతుడై వేగమే కరముపట్టుకొని, "సోదరీ! నీకీ సాహసము తగునా? ఆత్మహత్య మహాపాతకము గాదా! నీ బహిఃప్రాణమగు నేనుండ నీ వీలాగున చేయుదగునా? నా ప్రాణమున్నంతవరకు నీకేమియు కష్టములు సంభవింపవు. రమ్మ"ని చెప్పి ఇర్వురును ఇల్లువిడిచి వెళ్లిరి. రాధాకృష్ణప్రసాద్ నకు సుజాత చెలియగు సుధేష్ణనిచ్చి అత్యంతవైభవముగా పరిణయము గావించిరి. సోదరీసోదరు లిర్వురును కంటకభూయిష్టమగు అరణ్యములో ప్రయాణముచేయుచుండిరి. ఒకనాడు గాలివాన ప్రళయభయంకరముగా నుండెను. అట్టి సమయమందు మేహర్ జాన్ అను దొంగలనాయకుడు సుజాత రూపమునకు మోహించి లలితమోహనుని దగ్గరనుండి ఆమెను అపహరించెను. సోదరు డామెకొరకై అరణ్యమంతయు వెదకెను. ఎంత వెదకినను ఆమె జాడ తెలియలేదు. అరణ్యములో లేదని నిశ్చయించి పట్టణములలో వెదకసాగెను. మధురానగరములో రమాకాంతుడు సుజాత వెళ్లినప్పటినుండియు బహుళపక్ష సుధాకరునిమాడ్కి క్షీణించుచుండెను. అతని జనని నిఖిలసద్గుణాలయయు అసమానసౌందర్యవతియునగు స్వర్ణలతామంజరి యను బాలికను వివాహమాడవలసినదని నిర్బంధపెట్టసాగెను. మాతృభక్తుడగు రమాకాంతుడు జనని ఆజ్ఞానుసారముగా ఆకన్యకను పరిణయమాడెను. స్వర్ణలతామంజరి గృహకృత్యములను నేర్పుతో నిర్వహించుచు అత్తగారియొక్కయు ప్రాణేశునియొక్కయు సేవయందే అహర్నిశలు కాలముగడపుచు సాధ్వీశిరోమణి యని ప్రఖ్యాతిగాంచెను. అత్తగా రామెను తల్లివలె ప్రేమతో ఆదరించుచుండెను. ఇవ్విధంబున రెండు సంవత్సరములు గడచెను. రమాకాంతుడు స్వర్ణలతను ఆదరించుటలేదు. సాధ్వీశిరోమణియగు నామె ప్రాణేశుని సంతోషపరచుటకు ప్రయత్నించుచుండెను. కాని రమాకాంతు డామె సేవలు గైకొనక సుజాతకొరకై విలపించుచుండెను. తల్లివలె నాదరించు అత్తగారు మరణించెను. ఆ సాధ్వియొక్క శోకమునకు పరిమితిలేదు. రమాకాంతు డామెను తల్లి ఆజ్ఞనుల్లం

958

ఘింపలేక వివాహమాడెను కాని సుజాత యొక్క సద్గుణంబులును రూపమును అతని హృదయపీఠికయందు నెలకొనియుండెను. తల్లి మరణానంతరము ఒకనాడు రమాకాంతుడు స్వర్ణలతను పుట్టినింటికి వెళ్లమని చెప్పెను. ఆ పతివ్రత భర్త యాజ్ఞానుసారముగా పుట్టినింటికి వెళ్లెను. రమాకాంతుడు గృహము పరిత్యజించి సన్యాసియై దేశాటనము చేయసాగెను. స్వర్ణలతామంజరి తన భర్త సుజాతను వెదకుటకై దేశాటనము చేయుచున్నారని గ్రహించి 'పతిని సంతోషపెట్టుటే పరమధర్మము. ఎన్ని కష్టములైనను సహించి సుజాతను వెదకి నాప్రాణేశ్వరునకు పరిణయముగావించి ధన్యురాలనయ్యెద'నని నిశ్చయించి యోగీశ్వరుని వేషము వైచుకొని అరణ్యములన్నియు వెదకసాగెను. దొంగలనాయకుడు మేహర్ జాన్ సుజాతను పాతాళగృహములో బంధించి తన్ను పరిణయమాడవలసినదని నిర్బంధపెట్టుచుండెను. అతను ఎంత కష్టపెట్టినను నిశ్చలమైన మనస్సుతో రమాకాంతునే ధ్యానించుచుండెను. కాని మేహర్ జాన్ కు లొంగుటలేదు. ఒకనాటి రాత్రి మేహర్ జాన్ తన చోరదళముతో చౌర్యమునకు వెడలెను. సమయము కనిపెట్టి ఇస్మాయిల్ ఖాన్ అను మ్లేచ్ఛుడు సుజాతతో లలితమోహనుడు తీసుకురమ్మన్నాడని నమ్మిక బుట్టునట్లు వచించి ఆమెను గృహము దాటించెను. మధ్యదారిలో తన్ను గూడవలసినదని నిర్బంధపెట్టసాగెను. ఆమె ఇష్టపడలేదు. క్రూరుడగు ఇస్మాయిల్ ఖాన్ ఉగ్రుడై నిశితకరవాలమును ఆమె వక్షస్థలమందు గ్రుచ్చెను. ఆమె ఆర్తనాదముతో క్రిందపడిపోయెను. ఇస్మాయిల్ ఖాన్ పారిపోయెను. ఆర్తధ్వని విని యోగివేషములోనున్న స్వర్ణలతామంజరి, వెదకుచు సుజాతపడియున్న స్థలమునకు వచ్చెను. ఆమె స్మృతితప్పి రక్తప్రవాహములో పడియుండెను. యోగి కమండలువులోనున్న ఉదకముతో గాయములు కడిగి కట్టుకట్టి శైత్యోపచారములు చేయసాగెను. ఆమె కన్నులు దెరచి యెదుట బాలసూర్యునివలె ప్రకాశించుచున్న యోగీశ్వరునకు నమస్కరించి సమస్త వృత్తాంతము జెప్పెను. స్వర్ణలతామంజరి 'ఇప్పటికి నా జన్మసార్థకమైనది, నా కష్టము ఫలించినది' అని మితిమీరిన సంతసమొందెను. సుజాతను గోపాలకుల సహాయముతో దగ్గరలోనున్న గ్రామమునకు తీసుకువెళ్లి సంపూర్ణారోగ్యము కలుగువరకు ఉపచారములుచేసి తర్వాత లలితమోహనుని వెదకి అతనికి సుజాతను ఒప్పగించి ఆమె రమాకాంతుని వెదకుటకు బయలుదేరెను. కాశీలో సన్యాసివేషములో ద్రిమ్మరుచున్న రమాకాంతునకీవార్త జెప్పి మధురానగరము తీసుకొని వచ్చెను. సోదరీసోదరు లిర్వురును స్వగృహమునకు వచ్చిరి. జననీజనకు లమందానందమొందిరి. ఒకానొక శుభదివసంబున సుజాతా రమాకాంతుల వివాహము అత్యంత వైభవముగా జరిగెను. వారు కల్యాణమండపములో నున్నప్పుడు స్వర్ణలతాదేవి కుసుమమాలికల రెంటిని గొనివచ్చి దంపతుల మెడలలో నలంకరించెను. సుజాత

స్వర్ణలతామంజరియే తన్ను రక్షించినదని చెప్పి ఆమెకు సాష్టాంగనమస్కారమాచరించెను. వివాహమునకు వచ్చిన జనులందరామెను పరోపకారిణియని పొగడసాగిరి. రమాకాంతు డామెను క్షమాపణకోరెను. సుజాతాదేవి స్వర్ణలతామంజరిని స్వీకరించవలసినదని రమాకాంతుని ప్రార్థించెను. అతడు అంగీకరించెను. కాని స్వర్ణలతాదేవి గృహసౌఖ్యముల నొల్లక బ్రహ్మచర్యము నవలంబించెను. ఆమె పరోపకారమే పరమధర్మమని నిశ్చయించి అనాథ శరణాలయము నొకదానిని స్థాపించెను. అహర్నిశలు రోగులకు సేవజేయుటయందే కాలము గడపుచుండెను. స్త్రీలకందరికి పతివ్రతాధర్మములు మున్నగు సద్విషయములు బోధించుచుండెను. అనతికాలములోనే ఆమె కీర్తి జగద్విఖ్యాతమాయెను. సోదరసోదరీమణులారా! సర్వ ధర్మములలోను పరోపకారమే సర్వోత్తమమైనది. ఎవ్వరైతే పరోపకారార్థమై తమ జీవితము వినియోగించెదరో అట్టివారికి ఇహపరములయందు కీర్తి గల్గును. సర్వేశ్వరుడు మోక్షమిచ్చును.

మురళి

కనకదండి గోపాలకృష్ణశాస్త్రిగారు

నిలుపరా! నిలుపరా!!
నీమురళిమృదుగానని ర్ఝరిని యతులనే
నిలుపరా!!! నిలుపరా!!!!
కలగీతిమెలికలలో
కలసిపోయిననేను
మెలితిరిగి మెలితిరిగి
నలిగిపోవుచునుంటి
వేదనచె పటపటా
హృదయతంత్రులు తెగిమె
వెర్రినై పోవుదునో?
నిలుపరా! నిలుపరా!!
యీమహావేదనను యికో వేగలేనురా!
నిలుపరా!!! నిలుపరా!!!!

సరసమగుగీతికతో
కరగిపోయిన నేను
ఏకొండకోనకో?
ఏయరణ్యానికో?
ఏనదీతటముకో?
ఏవిజనసీమకో?
తెలియక నెయతులనె
తేలిపోమెదనోరా!
మరలిరాలేకనే
నురిగిపోమెదనోరా!
నిలుపరా! నిలుపరా!!
నీమధురతరమురళి నిస్వనస్రోతమును
నిలుపరా!!! నిలుపరా!!!!

962